అటు అభివృద్ధి.. ఇటు సంక్షేమం


అమ్మగారిపల్లె సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి


ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

- ప్రజల రుణం తీర్చుకుంటాం
- అర్హులందరికీ పథకాలు అందిస్తాం
- పల్లెబాటలో మంత్రి పెద్దిరెడ్డి

సదుం: ఒకవైపు అభివృద్ధి.. మరో వైపు సంక్షేమ పథకాలను పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని రాజీవ్‌నగర్ నుంచి ఆయన పల్లె బాట ప్రారంభించారు. తిమ్మనాయనపల్లె, గొంగివారిపల్లె, అమ్మగారిపల్లె, సదుం, రెడ్డవారిపల్లె, చింతవర్తివారిపల్లె పంచాయతీల్లోని 33 గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. ప్రతి గ్రామంలో ప్రజలు ఆత్మీయంగా స్వాగతం పలికారు. మంత్రి పెద్దిరెడ్డి ప్రతి ఒక్కరినీ పేరుపేరునా పలకరించారు. కుశల ప్రశ్నలు వేస్తూ యోగక్షేమాలు విచారించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలోనే నాగిరెడ్డి ఇళ్లలో తాగునీటి బోరు, ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభించారు. కలకటవారిపల్లెలో సచివాలయం, రెడ్డివారిపల్లెలో ఆర్బీకే, దిగువ కురవపల్లె, అమ్మగారిపల్లె, బందార్లవారిపల్లె, రెడ్డివారిపల్లె, పిడిగోవులవారిపల్లె, చింతపర్తివారిపల్లెలో అంగన్‌వాడీ కేంద్ర భవనాలను ప్రారంభించారు. అనంతరం మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు ఎప్పుడూ తనకు అండగా ఉంటున్నారని, వారి రుణం తీర్చుకునేలా అభివృద్ధి చేస్తున్నామని వెల్లడించారు. గత టీడీపీ ప్రభుత్వంలో పుంగనూరు నియోజకవర్గాన్ని చిన్నచూపు చూశారని, ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో అభివృద్ధిని పరుగులు తీయిస్తున్నామని వివరించారు. అడిగిన ప్రతి అభివృద్ధి పనికీ ముఖ్యమంత్రి వెంటనే ఆమోదం తెలుపుతున్నందుకు కృతజ్ఞతలు చెప్పారు. పేదరికమే ప్రామాణికంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప, పార్టీ మండల కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, వైస్ ఎంపీపీ ధనుంజయరెడ్డి, సర్పంచ్‌లు మురళీరెడ్డి, నర్మద, వరలక్ష్మి, ఉషారాణి, హనుమంతరెడ్డి, రేణుకమ్మ, ఎంపీటీసీ సభ్యులు మంగమ్మ, విజయలక్ష్మి, ఆనంద, సింగిల్ విండో చైర్మన్ తిమ్మారెడ్డి, వైస్ చైర్మన్ రమేష్‌రెడ్డి, రాజారెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు ఇమ్రాన్, గౌరీరెడ్డి, నారాయణరెడ్డి, హరినాథరెడ్డి , మాజీ సర్పంచ్ సయ్యద్ బాషా పాల్గొన్నారు.

నేటి పర్యటన

మండలంలో మంగళవారం బూరగమంద, మొరవపల్లె, జోగివారిపల్లె, చెరుకువారిపల్లె, నడిగడ్డ పంచాయతీల్లోని 41 గ్రామాల్లో మంత్రి పెద్దిరెడ్డి పర్యటించనున్నారు. పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం చేయనున్నారు.

చట్టం అతిక్రమిస్తే చర్యలు


సూచనలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసమూర్తి

రొంపిచెర్ల : చట్టం అతిక్రమిస్తే ఎంతటి వారైనా చర్యలు తప్పవని డీఎస్పీ శ్రీనివాసమూర్తి స్పష్టం చేశారు. సోమవారం రొంపిచెర్ల పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ రాజకీయ పార్టీల కార్యకర్తలు సమయమనం పాటించాలని, ఘర్షణకు పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. బ్యానర్ల చించివేత ఘటనలో నమోదైన కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీఐ అశీర్వాదం, ఎస్‌ఐలు శ్రీనివాస్, రవిప్రకాష్‌రెడ్డి, ఏఎస్‌ఐలు తులసీరామ్, మధు పాల్గొన్నారు.

ఈకేవైసీ తప్పనిసరి

పులిచెర్ల(కల్లూరు): పీఎం కిసాన్ యోజన కింద లబ్ధి పొందాలంటే రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని ఏఓ హరిప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండలంలో మొత్తం 5,990 మంది రైతులకు గాను ఇప్పటి వరకు 4,510 మంది మాత్రమే ఈకేవైసీ చేయించుకున్నారని వివరించారు. మిగిలిన 1,480 మంది వెంటనే రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని కోరారు.

క్లుప్తంగా

ఘనంగా త్యాగయ్య ఆరాధన


ఆరాధనోత్సవంలో వాయిద్య కళాకారులు

పులిచెర్ల(కల్లూరు): స్థానిక చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో సోమవారం కల్లూరు నాయీ బ్రాహ్మణులు ఘనంగా త్యాగరాజస్వామి ఆరాధనమహోత్సవం నిర్వహించారు. పలువురు వాయిద్య కళాకారులు హాజరయ్యారు. త్యాగయ్య సంగీతంలో విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో సిద్ధయ్య, గురునాథం, శ్రీనివాసులు, మునిరాజా, శివరామమూర్తి పాల్గొన్నారు.

శ్మశానవాటిక దారి కోసం వినతి


డీటీకి వినతిపత్రం ఇస్తున్న సర్పంచ్ రాజగోపాల్

రామకుప్పం: మండలంలోని బగళనత్తంలో శ్మశానవాటికకు దారి సౌకర్యం కల్పించాలని సర్పంచ్ రాజగోపాల్ కోరారు. సోమవారం ఈ మేరకు డిప్యూటీ తహసీల్దార్ కొలేష్‌కు వినతపత్రం అందించారు. త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని డీటీ తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ సురేంద్రరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల ప్రచార కార్యదర్శి కేశవరెడ్డి, స్థానిక నేత నాగరాజరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు టీషర్టుల పంపిణీ


టీషర్టులు అందిస్తున్న శాంతమ్మ, సునీత

చౌడేపల్లె : మేకలచిన్నేపల్లె ఉన్నతపాఠశాల విద్యార్థులకు కొండూరు శాంతమ్మ, సునీత సోమవారం టీషర్ట్‌లు వితరణగా అందించినట్లు ప్రధానోపాధ్యాయని నాగమల్లిక తెలిపారు. మొత్తం 150 మంది విద్యార్థులకు సుమారు రూ.35వేల విలువైన టీషర్ట్‌లను దాతలు అందజేసినట్లు వెల్లడించారు. అనంతరం దాతలను సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వీరభద్రయ్య, దామోదరరం, శ్రీనివాసులు, పురుషోత్తం, గోవిందు, లింగమూర్తి పాల్గొన్నారు.

డైరీ.. క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ విడుదల చేస్తున్న ఎంఈఓ హసన్‌సాహెబ్ తదితరులు

రొంపిచెర్ల: స్థానిక ఎమ్మార్సీ కార్యలయంలో సోమవారం ఎస్టీయూ డైరీ, క్యాలెండర్‌ను ఎంఈఓ హసన్‌సాహెబ్ ఆవిష్కరించారు. ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.లోకనాథరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు రమణారెడ్డి, శ్రీరాములు, యల్లప్ప, రవిశేఖర్‌రెడ్డి, జయరాంరెడ్డి, నరిసింహరెడ్డి, మదనమోహన్‌రెడ్డి, సర్ఫరాజ్, శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

కిండర్‌కేర్‌కు ఐదు క్వింటాళ్ల బియ్యం


పిల్లలకు ఆట వస్తువులు అందిస్తున్న గ్రామస్తులు

పలమనేరు : కిండర్‌కేర్ పాఠశాలకు గంగవరం మండలం నలసానపల్లెవాసులు 5 క్వింటాళ్ల బియ్యం, ఆట వస్తువులను సోమవారం అందించారు. బుద్ధిమాంద్యం పిల్లల ఆకలి తీర్చాలనే ఉద్దేశంతో సాయం చేసినట్లు వారు తెలిపారు. సర్పంచ్ చంద్రశేఖర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

రూ.35 లక్షలతో డ్రైనేజీల నిర్మాణం

పలమనేరు : మండలంలోని టి.వడ్దూరు గ్రామంలో రూ.35లక్షల జెడ్పీ నిధులతో డ్రైనేజీలు నిర్మిస్తున్నారు. సోమవారం ఈమేరకు సర్పంచ్ మునస్వామి మాట్లాడుతూ గంగమ్మ ఆలయ నుంచి తావడపల్లె చెరువుకు వరకు రూ.20లక్షల వ్యయంతో కాలువల పనులు ఇప్పటికే పూర్తయినట్లు వెల్లడించారు. మరో రూ.15లక్షలతో బేరుపల్లెలో డ్రైనేజీలు నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు.

సోషల్ మీడియా మండల కో-కన్వీనర్‌గా గంగాధరం

రామకుప్పం: వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా మండల కో–కన్వీనర్‌గా గంగాధరం నియమితులయ్యారు. సోమవారం ఈమేరకు ఎమ్మెల్సీ భరత్ నియామక పత్రం అందించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, జెడ్పీటీసీ సభ్యుడు నితిన్‌రెడ్డి, నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ మురుగేష్ అభినందనలు తెలిపారు.

లారీ ఢీకొని ఒకరి మృతి

పలమనేరు : కుప్పం– పలమనేరు రహదారిపై దుగ్గినవారిపల్లె వద్ద సోమవారం రాత్రి లారీ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. బైరెడ్డిపల్లె మండలం కొత్తిండ్లుకు చెందిన నాగరాజు(46) బైక్‌పై పలమనేరుకు వెళుతుండగా ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. క్షతగాత్రుడిని 108లో చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు.

క్రీడలతో శారీరక దృఢత్వం


క్రికెట్ టోర్నీ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న సుధీర్‌రెడ్డి

సోమల: క్రీడలతో శారీరక దృఢత్వం పొందవచ్చని వ్యవసాయ సలహామండలి సభ్యుడు పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో పెద్దిరెడ్డి భాస్కర్‌రెడ్డి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. తన తండ్రిపై అభిమానంతో మూడేల్లుగా క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్న షావలీ, మిత్ర బృందాన్ని అభినందించారు. అనంతరం టీడీపీ నేతల దాడిలో గాయపడిన వైఎస్సార్‌సీపీ నేత పీఎల్ఆర్ రాజారెడ్డి, అనారోగ్యంతో చికిత్స పొందుతున్న సింగిల్ విండో చైర్మన్ వెంకటేశ్వరరావును పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈశ్వరయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్లు అమాస మోహన్, నాగేశ్వరరావు, నేతలు నాగభూషణంరెడ్డి, హరినాథ్ పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు


సీసీ రోడ్డు పనులు పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు

వి.కోట : మండలంలో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు సర్పంచ్ పీఎస్ లక్ష్మి తెలిపారు. సోమవారం పంచాయతీ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ పట్టణంలో శిథిలావస్థకు చేరిన మటన్ మార్కెట్‌ను తొలగించి, నూతనంగా నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. బస్టాండ్‌లో నిర్మించిన పంచాయతీ కాంప్లెక్స్‌కు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పేరు పెట్టామని వెల్లడించారు. ఈ కాంప్లెక్స్‌ను త్వరలోనే ఎమ్మెల్యే వెంకటేగౌడ, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. పారిశ్రామికవేత్త కోట్ల కిరణ్‌కుమార్‌రెడ్డి చేతులమీదుగా బస్టాండ్ వద్ద వైఎస్సార్ కాంస్య విగ్రహం ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. అలాగే పాత పంచాయతీ భవనాన్ని తొలగించి, వాణిజ్య సముదాయం నిర్మించేందుకు అనుమతులు మంజూరు చేశామన్నారు. ఎంపీ నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మింస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం పలు ప్రాంతాల్లో రోడ్ల పనులను పరిశీలించారు. కార్యక్రమంలో వైస్ సర్పంచ్ అక్మల్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పీఎస్ నాగరాజు, ఈఓ యాదవపతి, వార్డు మెంబర్ కుమార్‌రాజా, నాయకులు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రజాసంకల్ప' సంబరం


వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు

వి.కోట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా చేపట్టిన ప్రజా సంకల్పయాత్ర చరిత్రలో మిగిలిపోతుందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పీఎస్ నాగరాజు కొనియాడారు. సంకల్ప యాత్ర 4 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం పట్టణంలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ తమీమ్, వైస్ సర్పంచ్ అక్మల్, జూనియర్ కళాశాల కమిటీ చైర్మన్ అమరనాథ్, వార్డు మెంబర్ కుమార్‌రాజా, నాయకులు శశికళ, నాగ పాల్గొన్నారు.

సోమల : మండల కేంద్రంలోని వైఎస్సార్ విగ్రహానికి వ్యవసాయ సలహా మండలి సభ్యుడు పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ పాదయాత్రలో ఇచ్చిన హామీలన్నీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేరుస్తున్నారన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్వరరావు, ఎంపీపీ ఈశ్వరయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్లు అమాస మోహన్, నాగేశ్వరరావు, నేతలు హరినాథ్, సురేంద్ర, కుమార్‌రాజా పాల్గొన్నారు.

మంగళంపేటలో క్రికెట్ టోర్నీ

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని మంగళంపేటలో బుధవారం క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. ఈ మేరకు సోమవారం నిర్వాహకులు మాట్లాడుతూ విన్నర్స్‌కు రూ.20,116, రన్నర్స్‌కు రూ.10,116 అందించనున్నట్లు వెల్లడించారు.

637 ఇళ్ల నిర్మాణమే లక్ష్యం

రొంపిచెర్ల: మండలంలో ఉగాది నాటికి 637 ఇళ్లు నిర్మించాలని లక్ష్యం నిర్దేశించినట్లు హౌసింగ్ ఏఈ యోగానంద్ తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ లబ్ధిదారులకు ఎప్పటికప్పుడు బిల్లులు మంజూరు చేస్తున్నామన్నారు. ఈ క్రమంలో ఇళ్ల నిర్మాణ పనులను మరింత వేగవంతం చేయాలని సూచించారు.

సంక్రాంతి కానుక పంపిణీ రేపు

రామకుప్పం: స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు ఎమ్మెల్సీ భరత్ చేతుల మీదుగా సంక్రాంతి కానుక అందజేయనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ రాధాకృష్ణ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని మహిళా ఉద్యోగులు, కార్మికులు కానుక అందుకునేందుకు తప్పక హాజరు కావాలని కోరారు.

భూసార పరీక్షలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఏఓ సుధారాణి

రొంపిచెర్ల: మండలంలోని బోడిపాటివారిపల్లెలో సోమవారం నిర్వహించిన పొలంబడిలో భాగంగా రైతులకు భూసార పరీక్షలపై అవగాహన కల్పించారు. ఏఓ సుధారాణి మాట్లాడుతూ భూమిలోని లోపాలను గుర్తించేందుకు పరీక్ష చేయించి, అందుకు అనుగుణంగా పంట సాగు చేసుకోవాలని సూచించారు. వరి నాట్లకు ముందుకు ఇసుకతో కలిపి కలుపు మందు చల్లుకోవాలన్నారు. ఎరువులు వేసేందుకు, ఎలుకల నివారణకు వరి పంటలో కాలిబాట ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్బీకే సిబ్బంది వెంకటరమణ నాయక్ పాల్గొన్నారు.

నాడు-నేడు పనుల పరిశీలన


నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎంపీపీ రామమూర్తి

చౌడేపల్లె : స్థానిక ఉన్నత పాఠశాలలో నాడు–నేడు పథకం కింద చేపట్టిన అభివృద్ధి పనులను ఎంపీపీ రామమూర్తి సోమవారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ నాణ్యతాప్రమాణాల మేరకు నిర్మించాలని సూచించారు. కట్టడాలకు సక్రమంగా వాటర్ క్యూరింగ్ చేయాలని ఆదేశించారు. విద్యార్థుల కోసం అదనపు తరగతి గదులు, పకడ్బందీగా మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మురళీ, రామచంద్రయ్య పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ ప్రభుత్వ పథకం


కూతేగౌనిపల్లెలో లబ్ధిదారుకు సంక్షేమ బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్సీ భరత్

శాంతిపురం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి కుటుంబానికీ ప్రభుత్వ పథకం అందుతోందని ఎమ్మెల్సీ భరత్ తెలిపారు. సోమవారం మండలంలోని సొన్నేగానిపల్లె, కూతేగౌనిపల్లెలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. బుక్‌లెట్ అందించి సంక్షేమ ఫలాలు సక్రమంగా అంతుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. స్థానిక సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ పథకాలు అందిస్తున్నామన్నారు. టీడీపీ నేతల కుటుంబాలకు సైతం రూ.లక్ష ల్లో ప్రభుత్వ సాయం అందిందని వివరించారు. ప్రతిపక్ష పార్టీలు కుట్రపూరితంగా అసత్య ప్రచారం చేసినా ప్రజలు పట్టించుకోవడంలేదని స్పష్టం చేశా రు. కార్యక్రమంలో ఎంపీపీ వసుంధర, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసులు, అటవీశాఖ డైరెక్టర్ కృష్ణమూర్తి, సర్పంచ్ మంజునాథరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు లోకనాథరెడ్డి, నాయకులు కోదండరెడ్డి, రవికుమా ర్, బీఎస్ వెంకటేశు, కుమార్ రాజా, విజయకుమార్, దుబాయ్‌గౌడ్, సుధాకర్‌రెడ్డి, మోహన్, ఎంపీడీఓ హేమమాలిని, తహసీల్దార్ లోకేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు నాయనపల్లెలో..

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్సీ భరత్ మంగళవారం సొన్నేగానిపల్లె పంచాయతీ నాయనపల్లెలో పర్యటించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బుల్లెట్ దండపాణి తెలిపారు. ప్రజాప్రతినిధులు, అన్నిశాఖల అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

ప్లాస్టిక్ వ్యర్థాల ఫ్యాక్టరీపై చర్యలకు వినతి


మున్సిపల్ చైర్‌పర్సన్‌కు సమస్య తెలియజేస్తున్న ఎల్‌బీనగర్ వాసులు

పలమనేరు : పట్టణంలని ఎల్‌బీ నగర్‌లో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాల ఫ్యాక్టరీతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నామని, పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు విన్నవించారు. సోమవారం ఈమేరకు పురపాలక కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర మురళీకృష్ణకు వినతిపత్రం అందించారు. చైర్‌పర్సన్ స్పందిస్తూ ఈ విషయాన్ని పరిశీలించాలని కమిషనర్ కిరణ్‌కుమార్‌ను ఆదేశించారు. దీనిపై కమిషనర్ వెంటనే ట్రాన్స్‌కో అధికారులతో మాట్లాడారు. ప్లాస్టిక్ ఫ్యాక్టరీకి విద్యుత్ కనెక్షన్ తొలగించాలని సూచించారు. పట్టణంలో ఎక్కడైనా పర్యావరణానికి హాని చేసే పరిశ్రమల కోసం కరెంట్ సర్వీసుకు దరఖాస్తు చేస్తే మున్సిపల్ అనుమతులు తీసుకున్న తర్వాతే మంజూరు చేయాలని కోరారు.

ఎంపీలను సత్కరించిన ఏఎంసీ చైర్మన్


ఎంపీలను సన్మానిస్తున్న హేమంత్‌కుమార్‌రెడ్డి

పలమనేరు : ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్‌రెడ్డి సోమవారం పుంగనూరులో ఎంపీలు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, రెడ్డెప్పను ఘనంగా సత్కరించారు. పలమనేరు మార్కెట్ కమిటీలో చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ మాజీ కన్వీనర్ మండీ సుధా ఉన్నారు.

గడప గడపలో ఘన స్వాగతం


తాగునీటి బోరును ప్రారంభిస్తున్న ఎంపీలు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, రెడ్డెప్ప


రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి

పుంగనూరు : అభివృద్ధి, సంక్షేమమే అజెండాగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన కొనసాగుతోందని ఎంపీ మిథున్ రెడ్డి తెలిపారు. ఆయన సోమవారం పుంగనూరు లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కులమతాలు, పార్టీలకుతీతంగా పథకాలు అందజేస్తున్నామని, అవినీతికి తావులేకుండా లబ్ధిదారుల ఖాతాలకు నేరుగా నగదు జమ చేస్తున్నట్టు తెలిపారు. మంచి చేస్తున్న వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చిరకాలం ముఖ్యమంత్రిగా ఉండేలా ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. పట్టణంలో గడప గడపకు మన ప్రభుత్వంలో పాల్గొన్న ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డికి అడుగడుగునా ఘన స్వాగతం లభించింది. మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డితో కలిసి ఆయన 1, 2, 31వ వార్డుల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా వార్డుల్లోని ప్రజలు ఆనందంగా ఎదురువచ్చి ఆత్మీయంగా స్వాగతం పలికారు. ఎంపీ మిథున్‌రెడ్డి ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల అమలు తీరును వివరించారు. స్థానిక సమస్యలు అడిగి తెలుసుకుని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. అనంతరం కొత్తయిండ్లు సచివాలయాన్ని తనిఖీ చేశారు. స్థానిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేశారు. పట్టణంలోని హిదయత్‌నగర్‌లో రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. స్థానిక మసీదు అభివృద్ధికి రూ.5 లక్షలు మంజూరు చేశారు. మంగళం కాలనీలో తాగునీటి బోరు ప్రారంభించారు. గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఆటో మెకానిక్‌ల సంఘ ప్రతినిధులు రాజారెడ్డి, మస్తాన్ ఆధ్వర్యంలో కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఆటో కార్మికులకు ఇంటి స్థలాలు కేటాయించాలని అధికారులను ఆదేశించారు. ఎంపీ మాట్లాడుతూ ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు తమ కుటుంబం ఎప్పుడూ ముందు ఉంటుందన్నారు. జానపద కళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ అమ్ము, జెడ్పీటీసీ సభ్యులు జ్ఞానప్రసన్న పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ


పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న ఫౌండేషన్ నిర్వాహకులు

బైరెడ్డిపల్లె : ప్రధాన మంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కింద సోమవారం మహతి ఫౌండేషన్ సహకారంతో పీహెచ్‌సీలో గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. వైద్యాధికారి విజయ్‌చంద్ర మాట్లాడుతూ మంచి ఆహారం తీసుకుంటే తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ నాగరాజు, హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రమ్మ పాల్గొన్నారు.